క్లుప్తంగా

150 మందికి ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రంలో బెంగళూరుకు చెందిన యూఎస్ ఆధారిత సంస్థ ఆర్కా రీసర్చ్‌కు చెందిన వైద్యులు డాక్టర్ గాయత్రి, అనూహ్యలు మంగళవారం రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక సివిల్ ఇంజినీర్ దండు రియాసత్ అలీఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 150 మంది రోగులకు టైప్–టూ డయాబెటీస్, హైపర్ టెన్షన్, బీపీలను అధునాతన సాంకేతిక స్క్రీనింగ్ ద్వారా ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. మానవ శరీరంలో వివిధ జీవక్రియ పరిస్థితుల ప్రారంభ ప్రమాదాన్ని ఈ పరీక్షల ద్వారా ముందుగానే గుర్తించవచ్చని డాక్టర్లు పేర్కొన్నారు.

అంగళ్లు మల్లయ్య కొండకు నిప్పు



కాలుతున్న అంగళ్లు మల్లయ్య కొండ

కురబలకోట : మండలంలోని అంగళ్లు మల్లయ్య కొండకు మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. చూస్తుండగానే కొండంతా కాలిపోయింది. పచ్చదనం కాలిపోయి నల్లగా మారింది. జీవాల పచ్చి మేత కోసం గుర్తు తెలియని వారు నిప్పంటించి ఉండవచ్చని భావిస్తున్నారు.

నూతన నియామకం



కె. ప్రణయ్‌రెడ్డి

కురబలకోట : వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా జంగావారిపల్లెకు చెందిన మాజీ జెడ్పీటీసీ కె. హరినాథరెడ్డి కుమారుడు కె.ప్రణయ్ రెడ్డి నియమితులయ్యారు. జిల్లా స్థాయిపదవి రావడంతో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ప్రణయ్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు పాటుపడతానన్నారు. అలాగే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుగే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

వీఆర్‌ఏ రామన్న మృతికి నివాళి



రామన్న మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం : వాల్మీకిపురం వీఆర్‌ఏ రామన్న అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మృతుడు రామన్న స్వగృహానికి చేరుకొని, మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాడ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే చింతల వెంట చింతల ఆనంద రెడ్డి, నీళ్లభాస్కర్, చింతల శివానంద రెడ్డి, కేశవ రెడ్డి ఉన్నారు.

బండ్రేవులో పోలీసుల కవాతు

పెద్దమండ్యం : మండలంలోని బండ్రేవులో స్థానిక పోలీసులు కేంద్ర పోలీసు బలగాలతో కలిసి మంగళవారం కవాతు నిర్వహించారు. అలాగే దిగువపల్లె పంచాయతీలో వడ్డివంకతండాలో పోలీసులు కవాతు చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు భద్రత, భరోసా కల్పిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఓటు హక్కు వినియోగంపై గిరిజనులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చెన్నకేశవ, ఏఎస్‌ఐ మధుసూధనాచారి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ డిపోగా తీర్చిదిద్దాలి



డ్రైవర్‌కు ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ : మదనపల్లె టు డిపోను ఆదర్శంగా తీర్చిదిద్దాలని డీఎం మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక డిపోలో ఆదర్శ ఉద్యోగులకు సన్మాన సభ ఏర్పాటు చేశారు. డీఎం మాట్లాడుతూ అందరూ కలసికట్టుగా పని చేయాలన్నారు. డిపోను లాభాల బాటలో పయనించేలా చూడాలన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు సమయపాలన పాటించి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఫిబ్రవరి నెలలో అత్యధిక ఈపీకె తెచ్చిన డ్రైవర్లు, కండక్టర్లు బి.జె.నాయక్, పిఎస్ వాసులు, వేమరాజులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఓటుహక్కు వజ్రాయుధంతో సమానం



మదనపల్లె: అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్వో హరిప్రసాద్



పీలేరులో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, సంఘమిత్రలు



పెద్దమండ్యం: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



పెద్దతిప్పసముద్రంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

- నిజాయితీగా ఓటు హక్కును వినియోగించుకోండి
- నియోజకవర్గ ఎన్నికల అధికారి హరిప్రసాద్
- ఓటుహక్కు వినియోగంపై అవగాహన
- పట్టణాలు, మండలాల్లో ర్యాలీ, మానవహారం

మదనపల్లె : ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధం వంటిది. ఓటుహక్కు ఉన్న ప్రతి ఒక్కరు ప్రలోభాలకు లొంగకుండా, నిజాయితీగా ఓటు వేసేలా ప్రజలను చైతన్యపరిచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీఓ హరిప్రసాద్ అన్నారు. మంగళవారం స్వీప్ ఆధ్వర్యంలో ఓటుహక్కు అవగాహన సదస్సులో భాగంగా నిర్వహిస్తున్న ర్యాలీని సబ్ కలెక్టరేట్‌లో జెండా ఊపి ప్రారంభించారు. మహిళా సంఘాల సభ్యులు, బీఎల్వోలు, సూపర్‌వైజర్లు, మున్సిపల్, రెవెన్యూ, మండలసిబ్బందితో కలిసి సబ్ కలెక్టరేట్, చిత్తూరుబస్టాండ్, టౌన్‌బ్యాంక్ సర్కిల్, బెంగళూరుబస్టాండ్, శ్రీకృష్ణదేవరాయసర్కిల్, అనిబిసెంట్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. మీ ఓటు అజ్ఞానానికి వ్యతిరేకంగా ఒక ఆయుధం, బుల్లెట్‌ని ఉపయోగించకుండా బ్యాలెట్‌ని ఉపయోగించండి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆర్వో హరిప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి ఓటే పునాది అని, ఓటు అనే రెండు అక్షరాల పదం దేశ భవిష్యత్తును మార్చేస్తుందన్నారు. కుల, మత, ప్రాంత, లింగ, జాతి, భాష అనే భేదం లేకుండా దేశంలో నివసించే 18 సంవత్సరాలు నిండిన పౌరులందరికీ భారత రాజ్యాంగం ఓటుహక్కును కల్పించిందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటును సద్వినియోగం చేసుకోకపోతే ప్రశ్నించే హక్కును కోల్పోతామన్నారు. ఓటునమోదుకు ఏప్రిల్ 15వరకు గడువు ఉందని, ఎన్‌ఈసీ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో ఓటుహక్కుకు నమోదుచేసుకుంటే, ఇంటివద్దకే వచ్చి వివరాలు తీసుకుని ఓటుహక్కు కల్పిస్తామన్నారు. ఓటరుగా నమోదుచేయడం అధికారుల బాధ్యత అయితే.. పోలింగ్‌రోజు తప్పనిసరిగా కేంద్రాల వద్దకు వెళ్లి తప్పనిసరిగా ఓటువేయడం ప్రజలందరి బాధ్యత అన్నారు. ఓటుకు నోటువద్దని, ప్రలోభాలకు గురికాకుండా, ఎవరైతే ప్రజాస్వామ్యవిలువలను కాపాడుతారో.. ప్రజలకు సేవచేస్తారో వారినే ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ భానుప్రసాద్, వన్‌టౌన్ సీఐ వలీబాషు, సీడీపీఓ సుజాత, ఆర్వో నాగేశ్వరరావు, మెప్మా సీఎంఎం రవి, వెలుగు ఏపీఎం సురేష్, మెప్మా, వెలుగు ఎస్‌హెచ్‌జీ గ్రూపు మహిళాసభ్యులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ

పెద్దమండ్యం: ఓటు హక్కు వినియోగంపై అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సంఘమిత్రలు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండు కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. ప్రజాస్వామ్యానికి పునాది ఓటు.. ఓటు హక్కును వినియోగించుకుందాం.. అంటూ నినాదాలు చేశారు.

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో వెంకటరమణయ్య మాట్లాడారు. ప్రజలు తమ ఓటును సద్వినియోగం చేసుకుకోవాలన్నారు. ఆదర్శవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం ఓటర్ల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర, ఏపీఎం మధుబాబు, సీసీలు శ్రీనివాసులు, సూరి, రమణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో మంగళవారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, రెవెన్యూ, పోలీస్, మహిళా సంఘాల సంఘమిత్రలు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేసుకోవచ్చన్నారు. అనంతరం స్థానిక బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడి ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులుతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

కురబలకోట: వయోజనులు ఓటర్లుగా నమోదై ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని తంబళ్లపల్లె నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి ఎస్.రాఘవేంద్ర కోరారు. ఓటర్ల నమోదు, ఓటు హక్కు వినియోగంపై మంగళవారం కురబలకోటలో అవగాహన ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై చైతన్యం కలిగి ఉండాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు వెలుగు ఏపీఎం నీరజ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్వేత, మంజుల, వెలుగు లీడర్ శంకరమ్మ, తులసీ, వసంత, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో..

పీలేరు : ఓటుహక్కు వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలని ఐసీడీఎస్ సీడీపీవో రాజమ్మ అన్నారు. మంగళవారం ఓటుహక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ, మానహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు చాలా విలువైందని, ప్రతి ఒక్కరూ విధిగా వినియోగించుకోవాలని కోరారు. ప్రలోభాలకు లొంగకుండా ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం లక్ష్మీరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు స్వర్ణ, స్వరూప, ఉమా, అక్కాయమ్మ, సంఘమిత్రలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం : ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయం నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించి, ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడివో సుధాకర్ రెడ్డి, ఈవోపిఆర్‌డి పాండురంగన్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రోహిణి, ఏపీఎం నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: ప్రతి ఓటరూ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఓటర్లను చైతన్య పరచాలని తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీవో కృష్ణమూర్తి కోరారు.మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వైఎస్సార్‌క్రాంతిపథం సీసీలు, సంఘమిత్రలు, ఉపాధిహామీ సిబ్బంది, ఐసీడీఎస్ కార్యాలయం సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు వారి పరిధిలోని ఓటర్లకు ఓటు ప్రయోజనంపై వివరించి సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలన్నారు. అనంతరం నినాదాలు చేసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోండి



నిమ్మనపల్లెలో ఓటరు అవగాహన ర్యాలీ

నిమ్మనపల్లె : ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బాలాజీరాజు అన్నారు. మంగళవారం ఓటరు అవగాహన సదస్సును వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటుహక్కుకు నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అవసరాలు తీర్చేది, పాలనలో మార్పు తెచ్చేది ఓటేనన్నారు. ఓటుహక్కును సక్రమంగా వినియోగించి, ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేయాలన్నారు. అనంతరం తవళంరోడ్, కందూరు రోడ్డు, ఇండియన్ బ్యాంక్ మీదుగా నిమ్మనపల్లె బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించి, మానవహారం చేశారు. ఓటర్లను చైతన్యపరిచారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షాలెట్, డీటీ తపస్విని, ఎంఈఓలు ఎం.ఆర్. పద్మావతి, నారాయణ, ఏపీఎం రజని, ఏఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం : ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నారాయణస్వామి, ఎస్‌ఐ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు హక్కును వినియోగించుకుని సమర్థవంత నాయకుడిని ఎన్నుకోవడంపై దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. యువత ముందుకొచ్చి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, బిఎల్‌వోలు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాలు నిలుపుదల చేయాలి



ఉద్యోగనియామకాలు నిలుపుదల చేయాలని కోరుతున్న అభ్యర్థులు

మదనపల్లె : ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి, మెడికల్ కళాశాలలో కంబైన్డ్ నోటిఫికేషన్ 1/2023–24కు సంబంధించి డీఎంఈ, ఏపీ, విజయవాడ ఆధ్వర్యంలో జరిపిన నియామకాలను నిలుపుదల చేయాలని కోరుతూ అభ్యర్థులు మంగళవారం మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ జమునకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నియామకాలకు సంబంధించి మెరిట్‌లిస్ట్ వెబ్‌సైట్‌లో కనపరచకుండా వివిధ ఉద్యోగాల్లో అభ్యర్థులను నియమించారన్నారు. దీంతో అర్హులకు అన్యాయం జరిగిందని, మెరిట్‌లిస్ట్‌ను వెబ్‌సైట్‌లో ఉంచి, తిరిగి నియామకాలు చేపట్టాలని కోరారు. ఈ విషయమై సమాచార హక్కు కింద తాము కోరిన వివరాలను అందించాలని అడిగారు. దీనిపై మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ స్పందిస్తూ...నియామకాలు తన పరిధిలో లేవని, కలెక్టర్‌ను కలిసి వివరాలు తీసుకోవాల్సిందిగా సూచించారు.

• వైభవంగా తిరుచ్చి ఉత్సవం



తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తిరుచ్చి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు మంగళవారం ఉదయాన్నే మూలవర్లకు శుద్ధి తోమాల సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ఊంజల్‌సేవ, తిరుచ్చిలో స్వామివారికి అలంకరణ కావించారు. ఈసందర్భంగా తిరుచ్చి ఉత్సవం గ్రామ పురవీధుల గుండా మేళతాళాలతో, జానపద కళాకారుల భజనలతో కన్నులపండుగగా సాగింది. వైభవంగా స్నపన తిరమంజనం కావించారు. వాహన మండపంలో స్వామివారి వాహనాన్ని రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. స్వామివారు పెద్దశేషవాహనంపై కొలువుదీరి గ్రామ పురవీధుల గుండా రంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.



స్వామివారి ఊరేగింపు దృశ్యం

• సీతారాముల కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం : స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో మంగళవారం శ్రీరాముడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం స్వామి వారికి అర్చన, అభిషేకం, తోమాలసేవ తదితర కార్యక్రమాల అనంతరం విశేష అలంకరణలో ముస్తాబైన ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో సాంప్రదాయ బద్ధంగా తీసుకెళ్లి ఆశీనులను చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. చివరగా హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలతో కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి కృష్ణమూర్తి, నాగరాజ, భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

మదనపల్లె సిటీ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మదనపల్లె విద్యాశాఖ డివిజన్ పరిధిలో మంగళవారం 52 కేంద్రాల్లో 9746 మంది విద్యార్థులకు 9392 మంది హాజరయ్యారు. 354 మంది గైర్హాజరయ్యారు. పది పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని డీవైఈఓ శ్రీరాం పురుషోత్తం తెలిపారు.

చెట్లు నరికివేయకుండా చర్యలు తీసుకోవాలి

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణంలో చిన్న కారణాలతో చెట్లును నరికివేయకుండా చర్యలు తీసుకోవాలని మదనపల్లె టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు, సభ్యులు మంగళవారం సబ్ డివిజన్ ఫారెస్టు అధికారికి వినతిపత్రం అందజేశారు. ప్రతి నెల విద్యుత్‌శాఖ మెయింటెన్స్ పేరుతో చెట్ల కొమ్మలను తొలగించడం తగదన్నారు. చెట్లు పెంపకానికి చర్యలు తీసుకోవాలన్నారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె : ఘర్షణలో ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన మంగళవారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. బసినికొండ బైపాస్‌రోడ్డులో శ్రీనివాసులు(51), తేజ హోటల్ నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. ప్రతిరోజు వారి హోటల్ ముందు మంత్రించిన అక్షింతలు గమనించి, ఆ పనికి పాల్పడిన వారిని నిందిస్తుండగా, పక్కనే హర్ష హోటల్ నిర్వహిస్తున్న బాలకృష్ణ వారితో గొడవకు దిగాడు. తన అనుచరులతో కలిసి వారిపై దాడికి పాల్పడ్డాడు. దాడిలో శ్రీనివాసులుతో పాటు జనార్ధనరెడ్డి(60) గాయపడ్డారు. స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని తాలూకా ఎస్‌ఐ రవికుమార్ పరిశీలించి, ఘర్షణకు కారణాలను తెలుసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శ

రామసముద్రం : మండలంలోని చెంబకూరుకు చెందిన కోఆప్షన్ సభ్యుడు షంషీర్ తండ్రి అహ్మద్‌జాన్ (80) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మదనపల్లె వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహమ్మద్ ఆ గ్రామానికి వెళ్లి మృతుడికి నివాళులర్పించి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు ఎంపీపీ కుసుకుమారి, సింగిల్‌విండో అధ్యక్షుడు కేశవరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నందకిషోర్‌రెడ్డి, సీనియర్ నాయకులు భాస్కర్‌గౌడ్, జేసీఎస్ కన్వీనర్ సిహెచ్ ప్రకాష్, రాధారెడ్డి, హైదర్‌వల్లి, ఆర్‌బికె చైర్మన్ కృష్ణమూర్తి తదితరులు నివాళులు అర్పించారు.

తిరునాలకు అంకురార్పణ

రామసముద్రం : మండలంలోని చెంబకూరు గ్రామంలో వెలసిన శ్రీగట్టువెంకటరమణస్వామి తిరునాలలో భాగంగా మంగళవారం అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయానికి ఉత్సవ మూర్తులను , కలశాలను తీసుకెళ్లి పూజలు నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ లోకేష్‌రెడ్డి

నిమ్మనపల్లె : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మంగళవారం మండలంలోని పోలింగ్‌కేంద్రాలను ఎస్ఐ లోకేష్‌రెడ్డి పరిశీలించారు. సామకోటవారిపల్లె, వెంగంవారిపల్లె, బాలినాయునిపల్లె, మండ్యంవారిపల్లె, అగ్రహారం పోలింగ్ కేంద్రాల్లోని వసతులను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో చేయాల్సిన ఏర్పాట్లపై పోలింగ్ అధికారులతో చర్చించారు. ప్రజలందరూ ఎన్నికల నియమావళిని పాటించాలని సూచించారు.

సీఎంగా జగనన్నకు మరో అవకాశం ఇవ్వండి



ఎన్నికల ప్రచారం చేస్తున్న పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి

కేవీపల్లె : మరింత అభివృద్ధి, సంక్షేమం ఆకాంక్షిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి మరో అవకాశం ఇవ్వాలని పీలేరు, కేవీపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వడ్లకుంట పంచాయతీ మంచాలమందలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ వంద శాతం అమలు చేసి మాటమీద నిలబడిన వ్యక్తిగా పేరొందారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైపు ధర్మం, న్యాయం ఉన్నాయని, జగన్‌కు ప్రజలందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షనేత చంద్రబాబుది అంతా మోసం, దగాలతో కూడుకున్నదని, ఎలాగైనా గెలవాలని నోటికొచ్చిన హామీలు ఇస్తున్నారని తెలిపారు. ప్రజలు మోసపోరాదని, చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ రెడ్డిమోహన్‌రెడ్డి, సర్పంచ్ వారాదమ్మ, నాయకులు గజ్జెల శీన్‌రెడ్డి, యర్రమరెడ్డి, చిన్నపరెడ్డి, చక్రధర్ పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే రాష్ట్రంలో సుపరిపాలన



కరపత్రాలు పంపిణీ చేస్తున్న చింతల సాయిక్రిష్ణారెడ్డి

వాల్మీకిపురం : సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కుమారుడు చింతల సాయిక్రిష్ణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక నాయక్‌వీధిలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ వలంటీర్ల ద్వారా గడప వద్దకే సంక్షేమ పథకాలు అందించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందుతున్నాయన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పులతో గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యస్థాపన సాకారం అయ్యిందన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్‌లు నిర్మించడంతో ప్రజలకు సర్వత్ర పౌరసేవలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కేశవ రెడ్డి, మహబూబ్‌బాషా, సైపుల్లా, మస్తాన్, అలీ, సాధిక్, షాహెద్, సాగుబడి ఆనంద రెడ్డి, ఖదీర్, అలీం తదితరులు పాల్గొన్నారు.

పట్టుదల, ఆత్మవిశ్వాసంతో చదివితే ఉద్యోగాలు



మాట్లాడుతున్న యుక్తేష్

కురబలకోట : పట్టుదల, ఆత్మ విశ్వాసం ..సరైన ప్రణాళిక ఆపై స్కిల్స్‌తో పాటు నైపుణ్యం సాధిస్తే ఎక్కువ జీతంతో కోరుకున్న ఉద్యోగాలు లభిస్తాయని స్మార్ట్ బ్రిడ్జ్ కంపెనీ డైరెక్టర్ యుక్తేష్ చింతమడక అన్నారు. మండలంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కేరీర్ రెడీనెస్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ వేతనంతో కూడిన మంచి ఉద్యోగం కావాలని అందరూ ఆశిస్తారన్నారు. చదువుకు ప్రతిఫలం ఉద్యోగమన్నారు. ఇది సరికొత్త జీవితానికి నాంది అన్నారు. చదువు పూర్తి చేసుకోవడం ఒక ఎత్తయితే మంచి ఉద్యోగం సాధించడం ఈ రోజుల్లో సవాల్‌గా మారిందన్నారు. అయితే ఇవి కొందరికే సాధ్యమవుతున్నాయన్నారు. ముఖ్యంగా కేరీర్ ప్లానింగ్, సబ్జక్టుపై పట్టు, సాంకేతిక పరిజ్ఞానం, ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావడం, క్రమశిక్షణ అవసరమన్నారు.

రేపు ఎంపీ మిథున్‌రెడ్డి పర్యటన

మదనపల్లె : వైఎస్సార్ సీపీ రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి గురువారం మదనపల్లె పట్టణంలో పర్యటిస్తారని ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు పట్టణంలోని జేసీఎం కమ్యూనిటీహాల్‌లో.. ప్రజాసంఘాల నాయకులు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, మేధావులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, వివిధ వర్గాలకు చెందిన ప్రతినిధులతో సమావేశమవుతారన్నారు. వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, ఇతర అంశాలపై చర్చించి, భవిష్యత్తులో చేయాల్సిన పనులపై సలహాలు, సూచనలు స్వీకరిస్తారన్నారు. అనంతరం మదనపల్లె నియోజకవర్గంలోని రామసముద్రం, నిమ్మనపల్లె, మదనపల్లె రూరల్, అర్బన్‌కు చెందిన సర్పంచ్, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, వార్డు కౌన్సిలర్లు, మెంబర్లతో పంచాయతీ, వార్డుల వారీగా స్థానిక స్థితిగతులపై చర్చించి, ఎన్నికల్లో గెలుపుకు కార్యాచరణ ప్రకటిస్తారన్నారు. కార్యక్రమాలకు నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.